

సేవా మిత్రులు

స్నేహమంటే కలిసి తిరగడమే కాదు.. కష్టకాలంలో ఒకరికి ఒకరు అండగా నిలబడటం. తోటి మిత్రులు ఆపదలో ఉన్నప్పుడు మేమున్నామంటూ చేయూతనిచ్చే ఆప్తమిత్రులపై కథనం. - 8లో..



డెంగీ లక్షణాలతో బాలుడు మృతి

డెంగీ లక్షణాలతో 14 ఏళ్ల బాలుడు మృతిచెందిన ఘటన కంభంలో శుక్రవారం రాత్రి జరిగింది. ఈ ప్రాంతంలో డెంగీ లక్షణాలున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. - 8లో..

గరిష్టం/కనిష్టం 36/28

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

డీఎడ్ పరీక్ష ఫీజు 11లోగా చెల్లించాలి

ఒంగోలు: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ 2023–25 బ్యాచ్ రెగ్యులర్, మొదటిసారి ఫెయిల్ అయిన విద్యార్థులు ఈనెల 11వ తేదీలోగా సంబంధిత కాలేజీ ప్రిన్సిపాల్ వద్ద పరీక్ష ఫీజు చెల్లించాలని జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు నుంచి ఆరు సబ్జక్టులకు రూ.150, మూడు సబ్జక్టులకు రూ.140, రెండు సబ్జక్టులకు రూ.120, ఒక సబ్జక్టుకు రూ.100 చెల్లించాలన్నారు. రూ.50ల అపరాధ రుసుముతో ఈనెల 19 వరకు చెల్లించే అవకాశం ఉందన్నారు.

రేషన్‌షాపు డీలర్‌పై 6–ఏ కేసు నమోదు

సాక్షి ఎఫెక్ట్..

యర్రగొండపాలెం: స్థానిక ఒక రేషన్ షాపు డీలర్‌పై 6–ఏ కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ విజయభాస్కర్ శనివారం తెలిపారు. గురువారం రాత్రి మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా ఆధ్వర్యంలో పట్టణంలోని 5 రేషన్ షాపులపై ఆకస్మిక దాడులు చేశారు. తనిఖీల్లో వై.రమాలక్ష్మికి చెందిన షాపు నంబరు 5లో నిల్వ కంటే ఎక్కువ రేషన్ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. 66.30 క్వింటాళ్ల బియ్యం స్టాక్ పాయింట్ నుంచి రేషన్ షాపునకు చేరాయి. అందులో 30.85 క్వింటాళ్ల బియ్యం పంపిణీ చేశారు. మిగిలిన 27.45 క్వింటాళ్ల బియ్యం నిల్వ ఉండాల్సి ఉండగా ఆ షాపులో అదనంగా ఉన్న 13 క్వింటాళ్లు కలుపుకొని 40.45 క్వింటాళ్ల బియ్యం స్టాక్ ఉన్నట్లు గుర్తించారు. ఆ సమయంలో అధికారులు తనిఖీ చేయకుండా టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. అధికారంలో ఉన్నాం.. మా జోలికొస్తే ఊరుకోమంటూ హెచ్చరించారు. దీనిపై సాక్షిలో ''ఐఏఎస్సా.. అయితే..?'' శీర్షికన కథనం ప్రచురించాం. దీనిపై స్పందించిన సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఆ షాపు డీలర్‌పై కేసు నమోదు చేశారు.

రెక్కలు విప్పిన.. చౌక దందా..

జిల్లాలో అధికార తెలుగుదేశం పార్టీ నేతలు చౌక బియ్యం దందాకు తెర తీశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పేదల బియ్యంపై కన్నేశారు. రేషన్ డీలర్లను బెదిరింపులకు గురిచేసి రాజీనామాలు చేయిస్తున్నారు. తమ మాట వినని వారిపై అధికారులను అడ్డంపెట్టుకుని వేధింపులకు గురిచేస్తున్నారు. రేషన్ దుకాణమే మా జీవితం అంటూ వేడుకుంటున్నా కనికరించడం లేదు. జిల్లాలో ఎక్కడ చూసినా రేషన్ బియ్యంపై పచ్చ గద్దలు వాలిపోతున్నాయి. ఉన్నతాధికారులను సైతం బెదిరింపులకు గురిచేస్తున్నారు. వీరి ఆగడాలకు అడ్డే లేకుండా పోతోంది. దేశం నేతల ఆగడాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మౌనం వహిస్తుండడం గమనార్హం.

- పేదల బియ్యంపై టీడీపీ నేతల కన్ను
- కొనసాగుతున్న డీలర్లతో బలవంతపు రాజీ నామాలు
- అంగీకరించని వారిపై వేధింపులు
- అధికారులను ఉసిగొల్పుతూ కక్ష సాధింపు
- నిన్న యర్రగొండపాలెంలో తనిఖీకి వచ్చిన ఐఏఎస్ అధికారిపై దూషణలు
- నేడు దర్శిలో డీలర్‌కు బియ్యం అందకుండా దౌర్జన్యం
- చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మౌన వ్రతం





సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ఇసుక, గ్రావెల్, రేషన్ బియ్యం ఇవి అధికార పార్టీ నేతలకు ప్రధాన ఆర్థిక వనరుగా మారిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పేదల బియ్యంపై కన్నేశారు. పక్కా ప్రణాళిక ప్రకారం దోచుకునేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. పాత రేషన్ డీలర్లతో బలవంతపు రాజీనామాలు చేయిస్తున్నారు. తమకు అనుకూలమైన వారిని నియమించుకునేందుకు అన్ని నియోజకవర్గాల్లో అధికార పార్టీ నేతలు చక్రం తిప్పుతున్నారు. జిల్లాలో 1392 రేషన్ దుకాణాలున్నాయి. టీడీపీ సానుభూతిపరులు, పర్మినెంట్ రేషన్ డీలర్లను మినహాయిస్తే సుమారు వెయ్యి మందికి పైగా డీలర్లను పక్కన పెట్టారు. అందులో బలవంతపు రాజీనామాలకు బలైన వారు, తమ మాట వినకపోతే వివిధ రకాల కేసులు పెట్టి పక్కన పెట్టిన వారు ఉన్నారు. జిల్లాలో 6,76,160 రేషన్ కార్డుదారులకు ప్రతి నెలా పంపిణీ చేస్తున్న 9500 టన్నుల పీడీఎస్ బియ్యం పంపిణీ జరుగుతోంది. అందులో భారీగా బియ్యాన్ని నల్లబజారుకు తరలించేందుకు రంగం సిద్ధం చేశారు. రేషన్ వ్యవస్థ ను తమ గుప్పెట్లోకి తెచ్చుకుని టీడీపీ నాయకుల చర్యలపై బరితెగించారనటానికి యర్రగొండపాలెం, దర్శి నియోజకవర్గాల్లో జరిగిన సంఘటనలు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

ఐఏఎస్‌లను లెక్కచేయక..

యర్రగొండపాలెంలో అక్రమ రేషన్ నిల్వ చేశారని వచ్చిన సమాచారం మేరకు తనిఖీకి వచ్చిన ఐఏఎస్ అధికారి మార్కాపురం సబ్ కలెక్టర్ మీనా పై టీడీపీ నేతలు రెచ్చిపోయారు. ఏం తమాషానా.. మా దుకాణాలే తనిఖీ చేస్తారా...? అధికారంలో ఉన్నాం ...మాజోలికొస్తే ఊరుకోం వెంటనే వెళ్లిపోండి అంటూ.. ఐఏఎస్ అధికారి రాహుల్ మీనాను బెదిరించడమే కాకుండా పోలీసులను కూడా అసభ్య పదజాలంతో దూషించారు. దీంతో మనస్తాపానికి గురైన సబ్ కలెక్టర్ తనిఖీలు నిలిపివేసి వెళ్లిపోయారు. అడ్డుకున్నది అధికార పార్టీ కావడంతో తమ విధులకు ఆటంకం కలిగించారంటూ ఒక్క అధికారి కూడా కనీసం ఫిర్యాదు చేయకపోవడం టీడీపీ నేతల ఆగడాలు ఏస్థాయిలో ఉన్నాయో ఇట్టే అర్థమవుతోంది.

రేషన్‌డీలర్ల మెడపై కత్తి

మార్కాపురం నియోజకవర్గంలో రేషన్ డీలర్ల మెడపై అధికారులతో పాటు టీడీపీ నేతలు కత్తిపెట్టారు. రాజీనామా చేస్తారా.. లేదంటే దాడులు చేసి 6ఎ కింద కేసులు నమోదు చేయమంటారా అంటూ బెదిరింపులకు దిగుతున్నారు. ఈనెల 1 నుంచి 3వ తేదీ లోపు మార్కాపురం పట్టణ, రూరల్, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి మండలాల్లో ఉన్న 48 మంది రేషన్ డీలర్లు ఒత్తిడులు భరించలేక రాజీనామాలు చేశారు. మార్కాపురం టౌన్‌లో 32 షాపులుండగా ఇప్పటికే 16 మందితో రాజీనామా చేయించి వారి స్థానంలో టీడీపీ అనుకూలమైన వారిని నియమించనున్నారు. పట్టణంలో 14 రేషన్ షాపులను డ్వాక్రా సంఘాలకు గత ప్రభుత్వంకేటాయించింది. ఇటీవలే డ్వాక్రా గ్రూపు లీడర్లతో సదరు రేషన్‌షాపులకు రాజీనామా చేయించారు. మిగిలిన 16 మంది డీలర్లను కూడా మార్చేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. కొనకనమిట్ల మండలంలో రెండు గ్రామాల రేషన్ డీలర్లతో సెలవులు పెట్టించారు. తర్లుపాడులో మండలంలో 19 షాపులుండగా 6 మందితో రాజీనామాలు చేయించారు. పొదిలిలో కూడా ఒకరితో రాజీనామా చేయించారు. మార్కాపురం మండలంలో 29 రేషన్‌షాపులుండగా ఇప్పటికే 23 రేషన్‌షాపుల డీలర్లతో రాజీనామాలు చేయించారు. పౌరసరఫరాల శాఖ, రెవెన్యూ అధికారులు డీలర్ల వద్దకు వెళ్లి రాజీనామా చేయాలని లేదంటే 6ఎ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కొండపి నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి నెలకొని ఉంది. ఇక్కడ యథేచ్ఛగా దందా కొనసాగుతోంది. 186 మంది డీలర్లలో 106 మందితో బలవంతంగా రాజీనామాలు చేయించారు. టీడీపీ కూటమి సానుభూతి పరులను నియమించుకుని దాదాపు 14 వేల బస్తాల బియ్యం పక్కదారి పట్టించేందుకు కుట్రలు పన్నుతున్నార్న ఆరోపణలు ఉన్నాయి.

అధికారులూ ఎందుకీ మౌనం?

గ్రామాల్లో డీలర్ల వద్దకు పంపాల్సిన రేషన్ బియ్యం అడ్డుకున్న వారి పై కేసులు నమోదు చేయాల్సిన అధికారులు గుడ్లప్పగించి చూస్తున్నారు. ఐఏఎస్ అధికారిని తనిఖీలు చేయకుండా నానా దుర్భాషలాడి పంపినా వారి పై ఎటువంటి కేసులు పెట్టడానికి అధికారులు ధైర్యం చేయడం లేదు. ఉన్నతాధికారులే కట్టడి చేయక పోతే ఈ దందాను అరికట్టేదెవరన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

బియ్యం పంపిణీ కాకుండా దౌర్జన్యం

దొనకొండ మండలం ఇండ్ల చెరువుకు చెందిన ఒక డీలర్ తమ మాట వినలేదని టీడీపీ నేతలు అరాచకాలకు దిగారు. పేదలకు బియ్యం పంపిణీ కాకుండా అడ్డుకుంటూనే ఉన్నారు. గత నెల 20 నుంచి 31వ తేదీ లోపు రేషన్ బియ్యం పంపిణీ చేయాల్సి ఉంది. అయితే దొనకొండ మండలం ఇండ్ల చెరువుకు చెందిన డీలర్‌కు ఎన్నిసార్లు బియ్యం పంపాలని చూసినా టీడీపీ నాయకులు అడ్డుతగులుతూనే ఉన్నారు. గత నెల 31వ తేదీ వరకు టీడీపీ నాయకులకు భయపడి డీలర్‌కు రేషన్ సరఫరా చేయలేదు. 31వ తేదీన పై అధికారుల ఆదేశాల మేరకు వారికి పంపాల్సిన ఇండ్లచెరువు షాపు నెంబర్ 10కి 12 టన్నుల బియ్యంతో రేషన్ లారీని ఇండ్ల చెరువుకు పంపారు. గ్రామంలో డీలర్‌కు రేషన్ దింపేందుకు వచ్చిన లారీని టీడీపీ నేతలు అడ్డుకుని గ్రామంలోకి లారీ వస్తే తగుల బెడుతామని బెదిరించారు. దీంతో ఎస్సై, రెవెన్యూ, ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు లారీని తీసుకుని వెనక్కు వెళ్లారు. తిరిగి శనివారం పోలీస్ బందోబస్తుతో వచ్చిన వాహనాన్ని సైతం గ్రామ శివారల్లో నిలిపివేసి వీరంగం సృష్టించారు. సాయంత్రం వరకూ లారీని ఊరిబయటే ఉంచేశారు. గ్రామంలో రేషన్ ఇస్తే మేమే ఇవ్వాలని, ఎవరూ రేషన్ ఇచ్చేందుకు సహకరించే ప్రసక్తే లేదని పోలీస్, రెవెన్యూ, ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులను సైతం లెక్క చేయలేదు. ఈవిషయం కలెక్టర్, ఎస్పీ స్థాయి అధికారులకు తెలిసినా ఏం చేయలేక టీడీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గారు. తిరిగి లారీని వెనక్కు పంపారు.



ఇండ్లచెరువులో రేషన్ లారీని అడ్డుకున్న టీడీపీ కార్యకర్తలు

అర్హుల పింఛన్లు తొలగించొద్దు

- బియ్యం మాఫియాను అరికట్టండి
- మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ సానుభూతి పరులని చెప్పి అర్హులైనవారి పింఛన్లు తొలగిస్తే సహించేది లేదని, ఉద్యమిస్తామని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి సురేష్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ సానుభూతిపరులైన రేషన్ డీలర్ల చేత బలవంతపు రాజీనామాలు చేయిస్తున్నారని కొన్ని మండలాల్లో అయితే పర్మినెంట్ షాపుల డీలర్ల చేత కూడా రాజీనామాలు చేయిస్తున్నారని ఆరోపించారు. డీలర్లు రాజీనామా చేసిన షాపులకు ఇన్‌చార్జిగా రెవెన్యూ అధికారులను నియమించి రేషన్ బియ్యం మాత్రం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా టీడీపీ కూటమి సానుభూతిపరుల గృహాల్లో దిగుమతి చేస్తున్నారని ఆరోపించారు. పౌరసరఫరాల శాఖ అధికారులు నిద్రపోతున్నారా అని ప్రశ్నించారు. అవినీతిపై ఉక్కుపాదం మోపుతా, గింజ కూడా తేడా రావటానికి వీలులేదు, ఒక గ్రాము కూడా తగ్గటానికి వీలులేదు అంతా పారదర్శకంగా పంపిణీ చేస్తానని చెబుతున్న రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ విధంగా అక్రమాలు జరుగుతుంటే ఏం చేస్తున్నారని మండిపడ్డారు. అవినీతిని అరికట్టడం మాటల్లో తప్ప చేతల్లో లేదా అని సురేష్ ప్రశ్నించారు. ఈ నియోజకవర్గానికి చెందిన మంత్రి కూడా చూస్తూ ఊరుకుంటున్నాడే తప్ప ఒక్క మాట కూడా మాట్లాడటం లేదన్నారు. ఇదేమని ప్రశ్నిస్తే మీరు కూడా చేస్తున్నారు కదా అని అంటున్నారని మేం ఎక్కడ చేశామో మంత్రి నిరూపించాలని సవాల్ విసిరారు. ఈనెల చక్కెర, కందిపప్పు కూడా లేవన్నారు. నియోజకవర్గ నాయకులకు నెలకు రూ.20 లక్షల బియ్యం మాఫియా డబ్బులు ఇవ్వాలని ప్రచారం జరుగుతోందని విమర్శించారు. దొంగ బియ్యం సరఫరా పై సమగ్ర సమాచారం తీస్తాం ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అవినీతి అరికడతారా మంత్రి నాదెండ్ల అని మాజీ మంత్రి సురేష్ నిలదీశారు. ఇసుక అక్రమ రవాణా నేటికీ కొనసాగుతోందని ఇసుక రవాణాలో వాటాలు కుదరక వందల కొద్దీ లారీలు రీచ్‌ల్లో ఆగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. 100 రోజులు సమయం ఇవ్వండి అన్ని సర్దుకుంటాయి..తరువాత సంపద సృష్టిస్తామన్నారని, ఈ విధంగా వారు సంపద సృష్టించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. సింగరాయకొండ మండలంలోని దేవీసీ ఫుడ్స్ పక్కనే ఉన్న రైసు మిల్లు కేంద్రంగా బియ్యం మాఫియా జరుగుతోందని ఇటీవల రైసుమిల్లులో తనిఖీలు చేసిన మంత్రి నాదెండ్లకు దమ్ముంటే ఈ రైసు మిల్లులో తనిఖీలు చేయాలని సవాలు విసిరారు. పార్టీ మండల అధ్యక్షుడు సామంతుల రవి కుమార్‌రెడ్డి, పుట్టా వెంకట్రావు, పొన్నలూరు జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, పాస్టర్ అశోక్, చొప్పర శివ, తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ ఆదిమూలపు సురేష్

బీఎస్ఎన్ఎల్‌లో ఇక 4జీ సేవలు

- ఈనెల 31 నుంచి జిల్లాలో 27 టవర్స్ పరిధిలో సేవలు ప్రారంభం
- బీఎస్ఎన్ఎల్ డిప్యూటీ మేనేజర్ షేక్ అజీర్



మాట్లాడుతున్న బీఎస్ఎన్ఎల్ డిప్యూటీ మేనేజర్ షేక్ అజీర్

ఒంగోలు సెంట్రల్: జిల్లాలోని బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు త్వరలో బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు ఇవ్వనున్నట్లు బీఎస్ఎన్ఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ షేక్ అజీర్ తెలిపారు. భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి బీఎస్ఎన్ఎల్ సేవల గురించి వివరించారు. డిప్యూటీ జనరల్ మేనేజర్ షేక్ అజీర్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా బీఎస్ఎన్ఎల్ కంపెనీతో టీసీఎస్ భాగస్వామ్యంతో 4జీ బీటీఎస్ ఇన్‌స్టాల్ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని 271 టవర్స్‌లో 31 జులై 2024 నాటికి 27 టవర్స్‌లో 4జీ ఇన్‌స్టలేషన్ పూర్తి చేయటానికి ప్రయత్నిస్తున్నామన్నారు. అదే విధంగా మరో 40 టవర్స్ వరకు కొత్తవి ఇన్‌స్టాల్ చేసి జిల్లాలోనే అన్ని ప్రాంతాలకు 4జీ కవరేజ్ ఇవ్వనున్నట్లు చెప్పారు. బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు 4జీ సేవలు పొందటానికి వారి మొబైల్ ఫోన్‌లో 4 జీ సిమ్‌కార్డ్ ఉండాలని తెలిపారు. జిల్లాలో 7774 మంది కస్టమర్లు 4జీ మొబైల్ హ్యాండ్‌సెట్ కలిగి ఉండి ఇంకా 2జీ సిమ్ కార్డు వాడుతున్నారని వీరంతా 4జీ సర్వీసులు పొందటానికి 4జీ సిమ్ కార్డ్‌కు మార్చుకోవాలని చెప్పారు. మీకు సమీపంలో బీఎస్ఎన్ఎల్ ఆఫీస్‌కు కానీ సమీపంలోని ఫ్రాంచైసీ షోరూమ్‌కు కానీ, బీఎస్ఎన్ఎల్ రిటైలర్స్ వద్ద కానీ లేక గొడుగు వేసి రోడ్ షో పెట్టిన డీలర్స్ వద్ద కానీ పూర్తి ఉచితంగా 4జీ సిమ్ కార్డ్ పొందవచ్చన్నారు. బీఎస్ఎన్ఎల్ ఫైబర్ నెట్ సేవలు కూడా విరివిగా అందిస్తున్నామన్నారు. తక్కువ టారిఫ్‌లకు మెరుగైన సేవలు అందిస్తున్నందున వినియోగదారులు తప్పనిసరిగా ఆదరించాలని కోరారు. 5జీ సేవలు ట్రయల్స్‌లో ఉన్నాయని అవి కూడా అందుబాటులోనికి వస్తాయని చెప్పారు. స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి పరచటంతో 4జీ రావటానికి కొంత సమయం పట్టిందని, ఇకపై సేవల్లో ఎటువంటి లోపాలు ఉండవని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌డీఏ డీ రాంబాబు, ఎస్‌డీఈ (పీఆర్) చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బాలిక డెలివరీ కేసులో నిందితుల అరెస్టు

- ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చదువుతున్న బాలికను గర్భిణి చేసిన కేసుకు సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. తొలుత సైదుబాబు అనే వ్యక్తి ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి ఆ బాలికను శారీరకంగా లొంగదీసుకొన్నాడు. ఇది చూసిన అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి ఆ బాలికను బెదిరించి, డబ్బులు ఆశ చూపి లొంగదీసుకున్నాడు. ఆ తరువాత ఈ విషయం శ్రీనివాసరెడ్డి బంధువు వెంకారెడ్డికి తెలిసింది. అతడు కూడా సదరు బాలికను బ్లాక్ మెయిల్ చేసి లోబరుచుకున్నాడు. దాంతో ఎస్టీ కులానికి చెందిన బాలిక గర్భిణి అయింది. ఆ తరువాత తను చదువుకుంటున్న కళాశాలలోని బాత్ రూంలో మృతశిశువుకు జన్మనిచ్చింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేసి శనివారం నిందితులను అరెస్టు చేశారు. సమావేశంలో ఒంగోలు డీఎస్పీ కిశోర్ బాబు, చైల్డ్ వెల్ఫేర్ కమిటి సభ్యురాలు బి. నీలిమా వంశీలత పాల్గొన్నారు.

కేజీబీవీ ప్రిన్సిపాల్, ఏఎస్ఎంపై వేటు

ఒంగోలు: కొత్తపట్నం మండలం మోటుమాల కేజీబీవీలో బాలిక బిడ్డకు జన్మనిచ్చిన ఘటన నేపథ్యంలో కేజీబీవీ ప్రిన్సిపాల్, ఏఎస్ఎంపై వేటు పడింది. ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరిన బాలిక నిండు గర్భిణి అయినా ఎవరూ ఆమెను గమనించలేదు. కేజీబీవీలో సైతం ఆమె 27 రోజులు ఉంది. సాధారణంగా నిండు గర్భిణి అంటే ఆమె పడే కష్టాలు అనేకం ఉంటాయి. బాలికల పాఠశాల కావడంతో విద్యార్థినుల ఆరోగ్య సమస్యలను ఎప్పటికప్పుడు పరీక్షించేందుకు, అవసరమైన ప్రాథమిక వైద్య సాయం అందించేందుకు, ఇంకా అవసరమైతే ఆస్పత్రికి పంపి ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లి వారికి విషయాన్ని వివరించి ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండేందుకు ప్రత్యేకంగా ఒక ఏఎన్ఎంను కూడా ప్రభుత్వం నియమించింది. అయితే ఇందులో ఎవరూ బాలిక డెలివరీ అయ్యే వరకు విషయాన్ని గుర్తించలేకపోయారు. దీంతో విషయం వెలుగులోకి రావడంతో మహిళా కమిషన్ సీరియస్ అయ్యింది. దీనిపై రిపోర్టు కావాలంటూ ప్రభుత్వానికి నోటీసులు పంపడం, ప్రభుత్వం కూడా సీరియస్ అయి జిల్లా పోలీసు అధికారులను ఆదేశించడంతో కలెక్టర్, విద్యాశాఖ అధికారులు అంతా హుటాహుటిన పాఠశాలకు వెళ్లి విచారించారు. దీనిపై పోలీసులు ఒక వైపు దర్యాప్తు జరుపుతుండగానే ప్రాథమికంగా కేజీబీవీ మోటుమాల ప్రిన్సిపాల్ వి.అరుణకుమారిని విధుల నుంచి తొలగించారు. ఈమె 2013 నుంచి ఇదే పాఠశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. మరో వైపు అదే పాఠశాలలో ఏఎన్ఎంగా పనిచేస్తున్న జె.సత్యవతిని కూడా విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

పదోన్నతులు వెనక్కి తీసుకోవడం దుర్మార్గం

- గత కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులను బేఖాతర్ చేయడం నిబంధనలకు వ్యతిరేకం
- సీడీపీవో, పీడీలపై చర్యలు తీసుకోకపోవడం విచారకరం
- న్యాయం చేయకపోతే చలో పీడీ ఆఫీస్ కార్యక్రమం చేపడతాం
- ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కారుసాల సుబ్బరావమ్మ

ఒంగోలు టౌన్: అంగన్‌వాడీ వర్కర్ల పదోన్నతులను వెనక్కి తీసుకోవడం చాలా దుర్మార్గమని, గత కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులను ఏమాత్రం లెక్కచేయకుండా వ్యవహరించడం నిబంధనలకు పూర్తిగా వ్యతిరేకమని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కారుసాల సుబ్బరావమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఒంగోలులోని సీఐటీయూ కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ..ఒంగోలు ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ హెల్పర్లుగా పని చేస్తున్న అశ్విని, కీర్తి, సల్మా, భవాని, రంజాన్, విజయకు జూన్ 25న పదోన్నతులు కల్పిస్తూ నాటి కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారని వివరించారు. వారంతా అంగన్‌వాడీ టీచర్లుగా 9 రోజులు విధులు కూడా నిర్వహించారని, అయితే జులై మొదటి వారంలో సీడీపీవో, పీడీలు అంగన్‌వాడీ సెంటర్లకు వెళ్లి భయాందోళనలకు గురిచేశారని తెలిపారు. కలెక్టర్ ఉత్తర్వులను వెనక్కి తీసుకుంటున్నామని, తిరిగి హెల్పర్లుగానే విధులు నిర్వహించాలని ఒత్తిడి చేసినట్లు తెలిపారు. ఈ విషయం గురించి ప్రస్తుత కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం చాలా అన్యాయమని చెప్పారు. పదోన్నతులను వెనక్కి తీసుకున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని, పదోన్నతులను కొనసాగించాలని, లేకపోతే అంగన్‌వాడీలను ఐక్యం చేసి పీడీ ఆఫీసును ముట్టడిస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో అంగన్‌వాడీలపై జరుగుతున్న రాజకీయ వేధింపులను అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5వ తేదీ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలోని స్కీం వర్కర్లుగా పనిచేస్తున్న ఆశా, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, ఆర్పీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్మికులు ప్రత్యక్ష ఆందోళనకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్, కుమారి, మున్నీ తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న కారుసాల సుబ్బరావమ్మ

ఒంగోలు జాతి పశు అభివృద్ధికి కృషి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

నాగులుప్పలపాడు: ఒంగోలు జాతి పశువుల అభివృద్ధి, ప్రభుత్వ పథకాల అమలుకు అందరం కృషి చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. నాగులుప్పలపాడు మండలంలో శనివారం కలెక్టర్ తమీమ్ అన్సారియా విస్తృతంగా పర్యటించారు. తొలుత మండలంలోని మద్దిరాలపాడులో జామ, సీతాఫలం పంటలు సాగుచేస్తున్న కాటా శేషయ్య, బైరపునేని రమాదేవిలకు సంబంధించిన పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఉద్యానవన పంటకు సంబంధించి 2018–19 కాలంలో డ్రిప్ ఇరిగేషన్ స్కీమ్ ద్వారా యూనిట్ ఖరీదు రూ.61,711 ప్రభుత్వం మంజూరు చేయగా, అందులో సబ్సిడీ కింద రూ.46,108 పోను రైతు వాటాగా రూ.15,603 చెల్లించినట్లు ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ రమణ కలెక్టర్‌కు వివరించారు. జిల్లా వ్యాప్తంగా డ్రిప్ ఇరిగేషన్ ద్వారా చేపడుతున్న జామ సాగు వివరాలను ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక సహాయాన్ని జిల్లా ఉద్యానశాఖాధికారి గోపిచంద్ కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వివరించారు. జిల్లాలో ఉద్యాన పంటలను మరింతగా ప్రోత్సహించడంతో పాటు ఆర్గానిక్ పంటను కూడా ప్రోత్సహించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఉద్యానశాఖ, ఏపీఎంఐపీ అధికారులను ఆదేశించారు. అనంతరం చదలవాడలోని పశు ఉత్పత్తి క్షేత్రాన్ని సందర్శించి ఒంగోలు జాతి ఆవుల ఉత్పత్తికి, వాటి సంరక్షణకు తీసుకుంటున్న చర్యలు గురించి ఉప సంచాలకులు రవి కుమార్ కలెక్టర్‌కు వివరించారు. పశుక్షేత్రంలో విభాగాల వారీగా పశు సంరక్షణకు చేపడుతున్న పనులను, పశు గ్రాసాభివృద్ధి సాగును కలెక్టర్ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పశు ఉత్పత్తి క్షేత్రంలో పశు ఉత్పత్తికి తీసుకుంటున్న చర్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. పర్యటనలో కలెక్టర్ వెంట పశు సంవర్ధకశాఖ జేడీ బేబిరాణి ఉన్నారు.



చదలవాడ పశుక్షేత్రంను పరిశీలిస్తున్న కలెక్టర్

ఏకేయూ డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల

ఒంగోలు: ఆంధ్రకేసరి యూనివర్శిటీ డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షా ఫలితాలను శనివారం వీసీ డీవీఆర్ మూర్తి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్శిటీ పరిధిలోని 88 డిగ్రీ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులకు ఏప్రిల్ 22 నుంచి 29 వరకు నిర్వహించిన రెండో సెమిస్టర్ పరీక్షలకు 7224 మంది పరీక్ష ఫీజు చెల్లించారని, కానీ అందులో 6377 మంది మాత్రమే పరీక్షలకు హాజరయ్యారన్నారు. వీరిలో 2966 మంది (46.51 శాతం) ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. బీఏ హానర్స్ విభాగంలో 355 మందికి 208 మంది, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్‌లో 2359 మందికి 1008 మంది, బీకాం జనరల్ విభాగంలో 89 మందికి 32 మంది, బీకాం ఒకేషనల్ విభాగంలో 33 మందికి 22 మంది, బీఎస్సీ హానర్స్ విభాగంలో 2636 మందికి 1275 మంది, బీఎస్సీ హానర్స్ విభాగంలో 2636 మందికి 1275 మంది, బీబీఏ విభాగంలో 66 మందికి 29 మంది, బీసీఏ విభాగంలో 839 మందికి 392 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారన్నారు. విద్యార్థులు భవిష్యత్‌లో ఇంకా మంచి ఫలితాలను సాధించాలని ఆయన ఆకాంక్షించారు, వ్యక్తం చేశారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అభినందించారు. ఫలితాలను యూనివర్శిటీ లింకు ద్వారా తెలుసుకోవచ్చని పరీక్షల అదనపు నియంత్రణ అధికారి డాక్టర్ బి.పద్మజ తెలిపారు. కార్యక్రమంలో సీఈ డాక్టర్ కేవీఎస్ రాజు, ఏసీఈ డాక్టర్ బి.పద్మజ, పరీక్షల విభాగం పర్యవేక్షకులు శివరామయ్యతోపాటు సిబ్బంది పాల్గొన్నారు. రెండో సెమిస్టర్ పరీక్షా ఫలితాలతో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులకు వీసీ ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి, ఏసీఈ డాక్టర్ బి.పద్మజ అభినందనలు తెలిపారు.

క్లుప్తంగా

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

పొదిలి: అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతిచెందిన సంఘటన పొదిలి పట్టణంలోని పీఎస్ఆర్ కాలనీలో జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పొదిలి పీఎస్ఆర్ కాలనీకి చెందిన చల్లా వెంకట సురేంద్రబాబు (40) ఒంగోలులోని పీఎఫ్ కార్యాలయంలో పని చేస్తున్నారు. భార్యాపిల్లలతో కలిసి స్వగృహంలోని పై అంతస్తులో నివాసం ఉంటున్నారు. కింద పోర్షన్‌లో తల్లిదండ్రులు నివాసం ఉంటున్నారు. ఎప్పటిలాగే శుక్రవారం రాత్రి నిద్రించిన సురేంద్రబాబు.. తెల్లవారేసరికి మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న సీఐ మల్లికార్జునరావు, ఎస్సై కోటయ్య సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

దొంగలు హల్ చల్

- కూల్ డ్రింక్ దుకాణంలో సామగ్రి, రెండు ద్విచక్రవాహనాలతో మాయం


చోరీకి గురైన కూల్‌డ్రింక్ షాపు

మార్కాపురం రూరల్: మండలంలోని దరిమడుగు గ్రామంలోని ఒక కూల్‌డ్రింక్ షాపు తాళాలు పగులకొట్టి అందులో ఉన్న సామగ్రిని తీసుకెళ్లడంతోపాటు మిగిలిన సామగ్రిని ధ్వంసం చేసి అక్కడే ఉన్న రెండు మోటారు సైకిళ్లను కూడా తీసుకెళ్లిన సంఘటన శనివారం వెలుగులోనికి వచ్చింది. బాధితుడు చదలవాడ శ్రీనివాసరెడ్డి.. గ్రామ శివార్లలో కూల్‌డ్రింక్ షాపు పెట్టుకుని నివసిస్తున్నాడు. శుక్రవారం రాత్రి యథావిధిగా షాపునకు తాళంవేసి ఇంటికి వెళ్లాడు. శనివారం ఉదయం షాపు వద్దకు రాగా తాళాలు పగులగొట్టడంతో పాటు అందులో ఉన్న సామగ్రి ఎత్తుకెళ్లారు. అనంతరం గ్రామంలో ఇళ్లముందు నిలిపి ఉంచిన రెండు ద్విచక్ర వాహనాలను కూడా దొంగలు తీసుకెళ్లారు. వీటిని ఆటోల్లో తరలించినట్లు గ్రామస్తులు భావిస్తున్నారు.



సేవా మిత్రులు



- నేడు స్నేహితుల దినోత్సవం

నేలను ముద్దాడే విత్తులు.. సుగంధాలు చిమ్మే పువ్వులు
ఆకాశాన తారలు.. మబ్బుల చాటున చంద్రుడు
తూర్పు రేఖలు.. పశ్చిమ కిరణాలు
జీవన గమనం మార్చే రుతువులు.. వాటికి మూలమైన ఆదిత్యుడు
ఇవన్నీ ఒకదానిపై ఒకటి చూపుకొనే స్నేహం అజరామరం. నిజమైన మిత్ర బంధం అమూల్యం. వజ్ర కవచ మహత్తర కావ్యం!!!
...
స్నేహానికి అర్థం కేవలం ఒకరిపై ఒకరు చూపించుకొనేదే కాదు. అది సమాజంపై మరింత బాధ్యత, ప్రేమ, కరుణ, జాలి చూపే దివ్యమైన ఆయుధం. ఈ నిజాన్ని నిజమైన స్నేహితులు ఎన్నో ఏళ్లుగా నిరూపిస్తూ మానవ సేవే.. మాధవ సేవ అని చాటుతున్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్

కంభం: పట్టణానికి చెందిన షేక్ ఖాసిం, అశోక్, నాయబ్, జాని, వెంకటేశ్వర్లు, సలీం, బాష, కోటి, వీరయ్య సమాజానికి తమ వంతు సాయం చేస్తున్నారు. 2017లో హెల్పింగ్ హ్యాండ్స్ పేరుతో ప్రతిఏటా రక్తదాన శిబిరాలు, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు చేపట్టడం, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించడం, అంగన్‌వాడీ కేంద్రాల్లో అవసరమైన వస్తువులు అందించడం వంటివి చేస్తున్నారు. అలాగే కరోనా కష్టకాలంలో కూరగాయలు అందించడం, దాతల ద్వారా సేకరించిన బియ్యాన్ని పంపిణీ చేయడం వంటివి నిర్వహించి అందరి మన్ననలు పొందారు.


ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తూ

అందరి వారు..

కనిగిరి రూరల్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1981–82 పదో తరగతి పూర్వ విద్యార్థులుసేవా కార్యక్రమాలతో ముందుకు వెళుతున్నారు. హుండాయ్ కంపెనీ జనరల్ మేనేజర్ (ముంబాయి) తోటా రవీంద్ర కుమార్, కనిగిరి పట్టణంలోని ఎలక్ట్రికల్ షాపు యజమాని వేమా రంగారావు, ప్రముఖ వ్యాపారి, ముచ్చర్ల ధర్మ, పీవీఎస్ సురేష్.. ఐఆర్ఎస్ కమిషనర్ (బెంగళూరు), బి. మురళి.. పోలీస్ శాఖ డీఈ (కడప), బి. చక్రవర్తి..ఎల్ఐసీ డివిజన్ మేనేజర్ (కర్ణాటక), హెచ్ఎం ముక్కు తిరుపతిరెడ్డి, మెకానిక్ మస్తాన్‌వలి, ఎస్‌కే మస్తాన్‌వలి (టోపి), ఎస్‌కే జిలాని, ఎంఈఓ శ్రీనివాసచారిలు పేదలకు దుప్పట్లు, దుస్తులు పంపిణీ, రూ 1.70 లక్షలతో స్టేజీ నిర్మాణం, పదో తరగతి విద్యార్థులకు బుక్స్, స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. 2020లో కరోనా సమయంలో మున్సిపల్ కార్మికులకు దుప్పట్లు అందించారు. రూ. 90వేల విలువ చేసే ఫ్యూజర్ బాక్స్ వితరణ. దివ్యాంగ విద్యార్థులకు నిత్యావసర వస్తువులు, పుస్తకాలు,సామగ్రి పంపిణీ చేశారు.


సేవాహిత కార్యక్రమాలు

కష్ట సుఖాల్లో తోడుగా..

మార్కాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంటుగా పనిచేస్తున్న వి. శ్రీనివాస్, మార్కాపుర పౌరసరఫరాల శాఖ గోడౌన్ డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎస్. చంద్రశేఖర్‌ల స్నేహం 30 ఏళ్లుగా కొనసాగుతోంది. 'ల్యాండ్ ఫోన్లు మాత్రమే ఉండేవి. అందుకే మాట్లాడుకోవాలంటే కచ్చితంగా కలవాల్సిందే. అలా ఇద్దరం జూనియర్ అసిస్టెంట్లుగా ప్రభుత్వ ఉద్యోగంలో జాయిన్ అయ్యాం. 'స్నేహాన్ని మించిన బంధం మరొకటి లేదు. తల్లిదండ్రులతో, భార్యా పిల్లలతో చెప్పుకోలేని ఎన్నో విషయాలు ఒక స్నేహితులకి మాత్రమే చెప్పుకుంటాం' అన్నారు.


శ్రీనివాస్, చంద్రశేఖర్

ప్రాణ స్నేహితులు

కనిగిరి రూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్న పల్లా కోటి రత్నం, మండలంలోని పాత ఏరువారిపల్లి ఉన్నత పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్న సయ్యద్ ఖలీల్‌లది సుమారు 40 ఏళ్ల స్నేహం. ఇంటర్ స్థానిక ప్రభుత్వ కళాశాలలో స్నేహితులయ్యారు. రత్నం చీరాలలో డిగ్రీ చేయగా, ఖలీల్ కనిగిరి డిగ్రీ కళాశాలలో చదివారు. ఆతర్వాత ఉన్నత విద్యాభ్యాసం చేసేటప్పుడు కూడా వీరి స్నేహం కొన సాగింది. 1993 పట్టణంలో 'రత్నం ప్రయివేటు స్కూల్‌ను' స్థాపించారు. 1998లో పల్లా కోటి రత్నంకు టీచర్ ఉద్యోగం వచ్చినా.. ఇద్దరు విడి పోకుండానే సంస్థను నడిపాడు. 1998 డీఎస్సీ బ్యాచ్‌లో ఇటీవల సయ్యద్ ఖలీల్‌కు కూడా ఉద్యోగం వచ్చింది. పాత ఏరువారిపల్లిలో ఉద్యోగం చేస్తున్నారు. ప్రతి రోజూ కనీసం ఒకసారైన పలకరించుకోవాల్సిందే.. కలవాల్సిందే.


పల్లా కోటిరత్నం, సయ్యద్ ఖలీల్

ఇద్దరు మిత్రులు

పామూరు: పట్టణానికి చెందిన 77 సంవత్సరాల విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు నెల్లూరి నరసింహారావు, విశ్రాంత గ్రామ పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ యాటా రాఘవు గోలీలు ఆడుకొనే వయసు నుంచీ స్నేహితులు. కులాలు వేరైనా ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి ఎస్ఎస్ఎల్‌సీ వరకు పామూరులోనే చదువుకున్నారు. రాఘవులు మాత్రం పంచాయతీ కార్యదర్శిగా పనిచేసి పదోన్నతిపై ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించి 2004లో ఉద్యోగ విరమణచేశారు. నరసింహారావు ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంగా పనిచేసి 2006లో ఉద్యోగ విరమణ చేశారు. నరసింహారావు 2 సార్లు ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు అందుకోగా, రాఘవులు ఉత్తమ ఈఓగా అవార్డు అందుకున్నారు. తోటి విశ్రాంత ఉద్యోగులకు సమాచారం అందిస్తూ సేవలు చేయడంతోపాటు, పేద విద్యార్థుల పిల్లలకు విద్యాభ్యాసానికి ఆర్థిక సాయం చేస్తూ పలువురి మన్ననలు పొందుతున్నారు.


నెల్లూరి నరసింహారావు, యాటా రాఘవులు

కరోనా కష్టంలో రక్ష వెల్ఫేర్ ఫౌండేషన్

కొమరోలు: పూర్వ విద్యార్థుల ఆలోచ నుంచి పుట్టిన రక్ష వెల్ఫేర్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలతో దూసుకెళుతోంది. కొమరోలు మండలానికి చెందిన పి.రంగజనార్ధన్, ఎం.శివబ్రహ్మ, ఎ.వెంకటేశ్వర్లు, కె.సునీల్‌కుమార్, బి.నారాయణరెడ్డి, కేవీ రవికుమార్, పి.రామలక్ష్మి, ఆర్.సురేంద్రవర్మ, ఎంవీ నారాయణ, షేక్ ఇమామ్ షరీఫ్, వై. శ్రీనివాసులు, షేక్ మరియంబీబీ, ఎస్.సంతోష్‌కుమారి కొమరోలులోని నిర్మల ఎయిడెడ్ పాఠశాలలో 1990వ సంవత్సరంలో 4వ తరగతిలో చేరారు. 8వ తరగతి వరకు ఒకే పాఠశాలలో కలిసి చదువుకున్నారు. ఆ తర్వాత కూడా వీరి స్నేహం పదిలమైంది. కరోనా కష్టకాలంలో చలించిన వీరంతా రక్ష వెల్ఫేర్ ఫౌండేషన్ పేరుతో 2020 సెప్టెంబరు నెల నుంచి సేవా కార్యక్రమాలు మొదలుపెట్టారు. నేటికీ వారి దాతృత్వాన్ని చాటుకుంటూనే ఉన్నారు.


వృద్ధ మహిళకు సాయం చేస్తున్న స్నేహ బృందం

ఆరోగ్య ప్రదాతలు

ఒంగోలు టౌన్ : నగరానికి చెందిన డాక్టర్ జాలాది మణిబాబు, డాక్టర్ మన్నే ఆంజనేయులు మంచి స్నేహితులు. ఒకరు రేడియాలజిస్ట్ అయితే, మరొకరు ఆప్తమాలజిస్ట్. ఒకరు వామపక్ష భావజాలం కలిగిన నాయకుడైతే, మరొకరు ఏబీవీపీ సానుభూతిపరుడు. ఒకరు హిందువైతే, మరొకరు క్రిస్టియన్. ఏ విషయంలో చూసినా వీరిద్దరి దారులు వేరు కానీ హృదయాలు మాత్రం ఒక్కటే. 1986లో కర్నూలు మెడికల్ కాలేజీలో పరిచయమైనప్పటి నుంచి ఇప్పటి వరకు కలిసే ప్రయాణం చేస్తున్నారు. చదువులు పూర్తి చేసుకున్నాక ఆంజనేయులు పులివెందులలోని రాజారెడ్డి వైద్యశాల, జమ్మలమడుగులోని క్యాబెల్ హాస్పిటల్‌లో నేత్ర వైద్యుడిగా పనిచేశారు. రేడియాలజీ పూర్తి చేసిన మణిబాబు అనంతపురం మెడినోవాలో చేరి రాయలసీమలో మంచి పేరు తెచ్చుకున్నారు. 2000లో ఆంజనేయులు ఒంగోలు వచ్చి సొంతంగా నేత్ర వైద్యశాలను ప్రారంభించారు. ఆతరువాత తన స్నేహితుడైన మణిబాబును ఒంగోలుకు రమ్మని ఒత్తిడి చేశారు. దాంతో ఆయన ఇక్కడకు వచ్చి స్నేహ డయాగ్నస్టిక్‌లో చేరారు. ఆ తరువాత మెడాల్ డయాగ్నస్టిక్స్ అధినేత అయ్యారు.



డాక్టర్ మెన్న ఆంజనేయులు, డాక్టర్ జాలాది మణిబాబు

స్నేహం కోసం

సింగరాయకొండ: మండల కేంద్రం సింగరాయకొండకు చెందిన 1993–94 బ్యాచ్ పదోదో తరగతి విద్యార్థులు హెల్పింగ్ హ్యాండ్స్ పేరుతో వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసుకొని సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. ఓ మిత్రుడు గుమ్మా శ్రీనుకు ఆటో కొనుక్కోవడానికి రూ. 50 వేలు సహాయం చేశారు. మరో మిత్రుడు షేక్ సంధానిబాషా కుమారుడు అనారోగ్యంతో బాధపడుతుంటే రూ. 50 వేలు, చేవూరి శేషు కరోనాలో మృతి చెందితే వారి కుటుంబానికి రూ. 40 వేలు అందించారు.


చనిపోయిన స్నేహితుని కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం

డెంగీ లక్షణాలతో బాలుడు మృతి


మృతిచెందిన భరద్వాజ్ (ఫైల్)


బాలుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

కంభం: డెంగీ లక్షణాలతో 14 ఏళ్ల బాలుడు మృతిచెందిన సంఘటన కంభంలో శుక్రవారం రాత్రి జరిగింది. బాలుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. కంభం పంచాయతీ పరిధిలోని అమ్మవారిశాల బజారులో నివాసం ఉంటున్న ఆలంపల్లి సుబ్బరాజు కుమారుడు ఆలంపల్లి భరద్వాజ్ (14) మూడు రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్నాడు. పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స అందిస్తుండగా, ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గిపోయింది. శుక్రవారం మెరుగైన చికిత్స కోసం ఒంగోలు తీసుకెళ్తున్న సమయంలో బాలుడి తండ్రి అనారోగ్యానికి గురవడంతో బాలుడిని తిరిగి కంభంలోని మరో ప్రైవేటు వైద్యశాలలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో బాలుడు మృతి చెందాడు. శనివారం సాయంత్రం ఎంపీడీఓ సయ్యద్ మస్తాన్‌వలి, ఈఓపీఆర్డీ విజయలక్ష్మి, కార్యదర్శి ఖాదర్‌వలి బాలుడి కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పరిసర ప్రాంతాల్లో శానిటేషన్, బ్లీచింగ్ చేయించారు. సీజనల్ వ్యాధులు, డెంగీ ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

సక్రమంగా బ్యాంకు రుణాలు చెల్లించాలి

- డీఆర్‌డీఏ పీడీ వసుంధరాదేవి

ఒంగోలు టౌన్: స్వయం సహాయక గ్రూపులు ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ ప్రతి నెలా 10వ తేదీలోపు సక్రమంగా పొదుపు రుణాల డబ్బు చెల్లించాలని డీఆర్‌డీఏ పీడీ పి.వసుంధరాదేవి ఆదేశించారు. శనివారం జిల్లా సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె ప్రసంగించారు. జిల్లా సమాఖ్య ఈసీ సభ్యులకు పలు సలహాలు, సూచనలు చేశారు. సీఐఎఫ్ శ్రీనిధి, ఉన్నతికి సంబంధించిన అన్ని రకాల రుణాల చెల్లింపులను ప్రతి ఒక్కరూ సకాలంలో చెల్లించేలా చూడాలన్నారు. ఈసీ సభ్యులంతా వారి పరిధిలోని మండలాల్లో స్వయం సహాయక గ్రూపుల ఆర్థికాభివృద్ధికి పాటుపడాలన్నారు. మహిళలంతా సుస్థిర జీవనోపాధి దిశగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. సంస్థలను స్వతంత్రంగా నిర్వహించుకునేలా మహిళా సంఘాలు ఎదగాలని కోరారు. ఉమెన్ లెడ్ ఎంటర్‌ప్రైజెస్ పొందడానికి స్వయం సహాయక గ్రూపుల్లోని సభ్యులు ఆధార్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. పాన్ కార్డు తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖాధికారి సుబ్బలక్ష్మి, డీపీఎం కృష్ణారావు, ఏపీఎంలు సుబ్బారావు, గంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ వసుంధరాదేవి

టీడీపీ నేత ఆగడాలపై ఫిర్యాదు


ఫిర్యాదు చేస్తున్న కుటుంబ సభ్యులు

తర్లుపాడు: తన పొలంలోకి అక్రమంగా ప్రవేశించి జేసీబీ ద్వారా రహదారి ఏర్పాటు చేసుకునేందుకు ప్రయత్నించిన టీడీపీ నేతపై మండలంలోని మేకలవారిపల్లికి చెందిన మందా పిచ్చమ్మ, కుటుంబ సభ్యులు శనివారం సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనాకు ఫిర్యాదు చేశారు. గత కొన్నిరోజులుగా సదరు వ్యక్తి రెవెన్యూ సిబ్బందిపై ఒత్తిడి తెచ్చి తమను పిలిచి రహదారికి స్థలం ఇవ్వాలంటూ వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. సంవత్సరాలుగా భూమిని సాగుచేసుకుంటూ జీవిస్తున్నామని తెలిపారు. అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకొని శిక్షించాలని ఫిర్యాదు చేశారు.

యువతి తండ్రిపై దాడి

మార్కాపురం: తన కూతురిని వేధిస్తున్న ఆకతాయిని ఓ తండ్రి మందలించినందుకు స్నేహితులతో కలిసి అతడిని కత్తితో పొడిచిన సంఘటన మార్కాపురం పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని నెహ్రూ బజారులో శుక్రవారం రాత్రి జరిగింది. పట్టణంలో ఒక ప్రైవేటు సెల్‌కంపెనీ డిస్ట్రిబ్యూటర్‌గా పనిచేస్తున్న నాలి సత్యనారాయణ కుమార్తెను పట్టణానికి చెందిన ఆకుల భవానీ వేధిస్తున్నాడు. రెండు రోజుల క్రితం భవానీని సత్యనారాయణ మందలించడంతో మనసులో పెట్టుకుని శుక్రవారం రాత్రి ఇంటికి వెళ్తున్న సత్యనారాయణపై స్నేహితులతో కలిసి కత్తితో భవానీ దాడి చేశాడు. స్థానికులు సత్యనారాయణను స్థానిక జీజీహెచ్‌కి తరలించి చికిత్స అందించారు.


గాయపడిన సత్యనారాయణ

టీడీపీ నాయకుడి ఓవరాక్షన్

- వాటర్ ప్లాంట్ శిలాఫలకం ధ్వంసం

ఒంగోలు టౌన్: మండలంలోని బొద్దులూరివారిపాలెం గ్రామంలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి హయాంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ శిలాఫలకాన్ని టీడీపీ నాయకుడు ధ్వంసం చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. గ్రామంలోని ప్రజలకు సురక్షితమైన మంచినీరు అందించాలన్న సంకల్పంతో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి తన హయాంలో గ్రామంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. సీఎండీఎఫ్ నిధులతో ఏర్పాటు చేసిన ఈ వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవాన్ని కూడా ఆయనే చేశారు. ఆ సమయంలో ఏర్పాటు చేసిన శిలాఫలకంపై బాలినేని శ్రీనివాసరెడ్డి పేరు ఉండటంతో రెండు రోజుల క్రితం టీడీపీ గ్రామ అధ్యక్షుడు గల్లా సురేష్ కుమారుడు తేజ పూర్తిగా ధ్వంసం చేశాడు. ఈ విషయం తెలిసి గ్రామ సర్పంచ్ కాట్రగడ్డ కవిత, వైఎస్సార్ సీపీ నాయకులు వెళ్లి అడ్డుకునే ప్రయత్నం చేశారు. ప్రశాంతంగా ఉన్న గ్రామంలో విభేదాలు రెచ్చగొట్టవద్దని కోరినప్పటికీ వినిపించుకోలేదని వారు తెలిపారు.


వాటర్ ప్లాంట్ వద్ద ధ్వంసం చేసిన శిలాఫలకం

విద్యార్థులంతా క్షేమం

మార్కాపురం రూరల్ : మండలంలోని మిట్టమీదిపల్లి గ్రామంలో ఉన్న మోడల్ స్కూల్లో విద్యార్థులందరూ క్షేమంగా ఉన్నారని ప్రిన్సిపాల్ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. మోడల్ స్కూల్లో శుక్రవారం సుమారు 30 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, అలర్జీలతో బాధపడ్డారు. వారిని వెంటనే సమీపంలో ఉన్న తిప్పాయపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లి చికిత్స చేయించారు. ప్రస్తుతం వారంతా క్షేమంగా ఉన్నారని తెలిపారు.

క్లుప్తంగా

రేషన్ షాపుల్లో అధికారుల తనిఖీలు



నిత్యావసరాల వివరాలు పరిశీలిస్తున్న డీటీలు

పెద్దదోర్నాల: మండల పరిధిలోని పలు రేషన్ షాపుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని 26, 27వ నంబర్ షాపుల్లో సరుకుల వివరాలు సరి చూసుకున్నారు. నిత్యావసర వస్తువుల అమ్మకం, స్టాక్ వివరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు కిరణ్, తిరుపతిరావు, వీఆర్వో కాశీశ్వరరెడ్డి పాల్గొన్నారు.

దొనకొండ తహసీల్దార్‌గా రమాదేవి



తహసీల్దార్ రమాదేవి

దొనకొండ: దొనకొండ నూతన తహసీల్దార్‌గా బి.రమాదేవి శనివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆమె యరగొండపాలెం తహసీల్దార్‌గా విధులు నిర్వహించి ఎన్నికల సమయంలో నెల్లూరు జిల్లాకు బదిలీపై వెళ్లారు. అన్ని వేళల్లో అందుబాటులో ఉండి ప్రజల సమస్యలు తమ సిబ్బందితో వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు.

తిరుమలనాథస్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో తిరుమలనాథస్వామి

పెద్దారవీడు: మండల పరిధిలో రాజంపల్లి సమీపంలో వెలసిన శ్రీ గొ్ద్రాలికొండ తిరుమలనాథస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు శనివారం చేశారు. అర్చకులు భవానీప్రసాద్ స్వామి వారికి అభిషేకాలు, కుంకుమార్చన పూజలు చేసిన అనంతరం పట్టువస్త్రాలు, ఆభరణాలు ధరించి పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. జీర్ణోద్ధరణ కమిటీ సభ్యులు ఆలయం ప్రాంగణంలో భక్తుల కోసం మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు.

హెడ్ కానిస్టేబుల్‌కు ఎస్పీ ప్రశంస

మార్కాపురం: స్థానిక పోలీసుస్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా.. కోర్టు లైజనింగ్ ఆఫీసరుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఐవీ శ్రీనివాసరావును ఎస్పీ దామోదర్ అభినందించి శనివారం ప్రశంసపత్రం అందించారు. 2019 జనవరి 16న మార్కాపురం పట్టణంలో భర్త శరభయ్య భార్య పార్వతిని హత్య చేసిన ఘటనలో గుడ్‌ట్రైల్ మానిటరింగ్ ద్వారా నిందితుడైన శరభయ్యకు యావజ్జీవ శిక్ష విధించడంలో కృషి చేసినందుకు అభినందించారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ నేరస్తులు తప్పించుకోకుండా సకాలంలో చర్యలు చేపట్టాలని ఎస్పీ సూచించినట్లు శ్రీనివాసరావు తెలిపారు.

7న ఉపాధి హామీ పనులపై ప్రజావేదిక

బేస్తవారిపేట: మండలంలోని అన్నీ గ్రామాల్లో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు జరిగిన ఉపాధి హామి పనులపై ప్రజావేదిక ఈ నెల 7వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ టి.పార్వతి తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 6వ తేదీ వరకు పంచాయతీల్లో సామాజిక తనిఖీ జరుగుతుందని వివరించారు. ప్రజావేదిక కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

బాల్య వివాహాలతో ఆరోగ్య సమస్యలు

గిద్దలూరు రూరల్: బాల్య వివాహాలతో మహిళలకు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని కె.ఎస్.పల్లె వైద్యాధికారి శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండల న్యాయసేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని దిగువమెట్ట చెంచు కాలనీలోని పాఠశాలల్లో శనివారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. బాల్య వివాహాలతో చిన్న వయసులోనే గర్భం దాల్చి ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమే కాకుండా అటు ఆరోగ్యానికి సైతం హాని కలిగిస్తాయన్నారు. ఈ సందర్భంగా గిరిజన మహిళలకు పండ్లు పంపిణీ చేశారు. సర్పంచి అంజినాయక్, డాక్టర్ మహ్మద్ జూబేరు, అటవీశాఖ డిప్యూటీ రేంజర్ వంశీకృష్ణ, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఆ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయమే



గుంతలమయమైన రోడ్డు



పెచ్చులుగా ఊడిన రోడ్డు

- అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- నిధులు మంజూరైనా చేయని పనులు
- చోద్యం చూస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు

కురిచేడు:

నూతన ప్రభుత్వం రహదారుల గురించి పట్టించుకుంటున్న పాపాన పోవడం లేదు. కురిచేడు నుంచి దొనకొండ వెళ్లే రోడ్డున వెళ్లాలంటే చుక్కలు కనిపిస్తున్నాయి. వినుకొండ, నరసరావుపేట, గుంటూరు తదితర ప్రాంతాల నుంచి దొనకొండ చేరుకునేందుకు ఇదొక్కటే దారి. గిద్దలూరు, మార్కాపురం తదితర ప్రాంతాల నుంచి కూడా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. గత టీడీపీ హయాంలో ఆనాటి మంత్రి శిద్దా రాఘవరావు దొనకొండ నుంచి అన్ని వైపులా ఉన్న ప్రధాన రహదారులను కలుపుతూ రోడ్లు నిర్మించామని, దొనకొండను ఇండస్ట్రియల్ హబ్‌గా మార్చామని ఊదరగొట్టారు. కానీ ఈ రోడ్డుకు తట్టెడు మట్టికూడా పోసిన దాఖలాలు లేవు. ఏడాది క్రితం కురిచేడు నుంచి గంగదొనకొండ వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి టెండర్లు కూడా పిలిచారు. ఆ టెండరు పాడిన వ్యక్తి రోడ్డు నిర్మాణం చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఈ రోడ్డులో నిత్యం ప్రయాణికులు గుంతలు అర్థంగాక పడిపోయి గాయాల పాలవుతున్నారు. కొందరు ప్రాణాలు పోగొట్టుకుంటున్నా ఆర్‌అండ్‌బీ అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేకపోవటం విశేషం. రోడ్డు అధ్వానంగా ఉండటంతో ఆర్టీసీ బస్సులు కూడా నడవడం లేదు. మండలంలోని పొట్లపాడు, మొండెద్దులపాలెం, గంగదొనకొండ గ్రామాల ప్రజలు నిత్యావసరాల కోసం, పలు కార్యాలయాల కోసం, రైలు బండికి ప్రయాణం చేసేందుకు కూడా కురిచేడు రావాల్సి ఉంది. దీంతో ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు కనీసం గుంతలకు మట్టి తోలించినా ప్రమాదాలు జరిగేవి కాదని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యం వీడి రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి:



రోడ్డు నిర్మాణం చేయక పోవటంతో నిత్యం బైకులు, ఆటోలు గుంతల్లో పడి బోల్తా పడుతున్నాయి. చాలా మందికి గాయాలు అవుతున్నాయి. అప్పుడప్పుడూ పెద్ద ప్రమాదాలు జరిగి ప్రాణాలు కూడా పోతున్నాయి. వెంటనే రోడ్డు నిర్మించాలి.

టి.యోగయ్య, పొట్లపాడు

పట్టించుకునే వారే లేరు:



రోజూ ఈ దారిన చాలా బండ్లు వచ్చిపోతుంటాయి. రోడ్డు గుంతలమయమైనా పట్టించుకునే వారు లేరు. జనవరిలో జరిగిన పొట్లపాడు తిరునాళ్లకు గుంతలకు కొంచెం కంకర పోసి వదిలేశారు. అవి తిరిగి యథావిధిగా మారాయి. ఇప్పటికైనా రోడ్డు పనులు చేయాలి.

పోతిరెడ్డి లక్ష్మీరెడ్డి, పొట్లపాడు



పెద్దారవీడు నుంచి బద్వీడు గ్రామానికి వెళ్లే మట్టి రోడ్డు

తారురోడ్లకు నోచుకోని గ్రామాలు

పెద్దారవీడు: మండలంలోని గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. మండలంలో పెద్దారవీడు నుంచి చెంచుగూడెం మీదుగా బద్వీడు, మద్దలకట్ట గ్రామం నుంచి చాట్లమడ గ్రామం వరకు మట్టి రోడ్లపై ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. మండల స్థాయి అధికారులు మారుతున్న గ్రామాలకు వెళ్లే రోడ్లను బాగుచేసే నాథుడే కనపడటం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మట్టి రోడ్లు వేయడంతో రాళ్లు లేచిపోవడంతో పాటు దుమ్మూధూళి లేచిపోతోంది. ఆటోలు, ద్విచక్ర వాహనాలు వెళ్లేటప్పుడు వెనుక వాహనంపై ప్రయాణించే వారికి కళ్లలో దుమ్మూధూళి పడుతుందని వాహనదారులు వాపోతున్నారు. రోడ్డుపై వర్షం కురిసినప్పుడు రాళ్లు లేవడంతో అధికంగా గుంతలుగా పడుతుడటంతో ప్రయాణం చేయడం చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆందోళన చెందుతున్నారు. గ్రామాలకు వెళ్లాలంటే ఆటోల్లో ప్రయాణం నరకయాతనంగా మారిందని, గత్యంతరం లేక నిత్యం ఆయా గ్రామాల మధ్య ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. గర్భిణులు, వృద్ధులు ఆటోల్లో ప్రయాణించాలంటే భయం భయంగా ప్రయణాలు కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడిందని మహిళలు వాపోతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా వారికి చెవిటి వాని చెవిలో శంఖం ఊదినట్లుగా ఉందని, పట్టించుకున్న పాపాన పోలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గ్రామాలకు వెళ్లే రహదారులకు తారు రోడ్లు వేయాలని అయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా ఆలయ ద్వితీయ వార్షికోత్సవం



తలపై బోనాలతో ఆలయానికి వస్తున్న మహిళలు

పెద్దదోర్నాల: మండల పరిధిలోని ఐనముక్కలలో నిర్మించిన ఆంజనేయస్వామి, గణపతి, పోలేరమ్మ, అంకాళమ్మ తల్లుల ఆలయం ద్వితీయ వార్షికోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం భక్తులతో కిటకిటలాడింది. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయం ముందు చలువ పందిళ్లు ఏర్పాటు చేసి భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా మంగళ వాయిద్యాలు, మేళతాళాల మధ్య దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కమనీయ దృశ్యాలు వీక్షించేందుకు భక్తులు భారీగా ఆలయానికి చేరుకున్నారు. ఆలయ అర్చకులు కాకర్ల లక్ష్మీ ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. వందలాది మంది భక్తులు తలపై బోనాలతో ఆలయానికి చేరుకుని ఆలయం ఎదుట కొబ్బరి కాయలు కొట్టి తమ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయంలో బోనాలు సమర్పించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు తీసుకొచ్చిన బోనాలు స్వీకరించారు. ఆలయ కమిటీ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు.

తల్లిపాల ప్రాధాన్యంపై అవగాహన కల్పించాలి



దొనకొండ: గంగదేవిపల్లిలో తల్లిపాల వారోత్సవాల ర్యాలీ

త్రిపురాంతకం: తల్లిపాల ప్రాధాన్యతను వివరించి పిల్లలకు పాలు అందేలా అవగాహన కల్పించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు హైమావతి, విశ్రాంతమ్మ పేర్కొన్నారు. మండలంలోని శ్రీనివాసనగర్‌లో తల్లిపాల వారోత్సవాలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యం అన్నారు. వ్యాధినిరోధక శక్తి తల్లిపాల ద్వారా లభిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌ఓ స్వరూప, ఏఎన్‌ఎం సంధ్యారాణి, అంగన్‌వాడీ కార్యకర్త ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

పుల్లలచెరువు: చిన్నారులకు తల్లి పాలు ఇవ్వడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని ఎంఈవో ఇందిరా ప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని చాపలమడుగులో తల్లిపాలవారోత్సవాల్లో కార్యక్రమంలో భాగంగా సూపర్‌వైజర్ సుబ్బమ్మ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులకు అవగాహన కల్పిస్తూ మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రపాలు తాపడం ద్వారా రోగనిరోధక శక్తి పెరుగుతుందని, పిల్లలకు పాలిస్తే తమ అందం తగ్గిపోతుందనే ఆపోహను వీడాలన్నారు. ప్రతి తల్లి బిడ్డకు పాలు ఇవ్వడం ద్వారా ఇద్దరు ఆరోగ్యకరంగా ఉంటారనేది తెలుసుకోవాలన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ మస్తాన్‌రావు, ఏఎన్‌ఎం మేరిబాయ్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ధర్మానాయక్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు, తల్లులు పాల్గొన్నారు.

దొనకొండ: పుట్టిన బిడ్డకు వెంటనే తల్లిపాలు తాపటంతో వ్యాధి నిరోధక శక్తి బిడ్డకు ఉంటుందని, అలాగే తల్లి పాలు బిడ్డకు శ్రేష్టకరమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సీహెచ్ సుభాషిణి తెలిపారు. మండలంలోని గంగదేవిపల్లిలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుభాషిణి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాల ప్రాధాన్యం వివరించారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రపాలు ఇవ్వటంతో వ్యాధి నిరోధక శక్తి బిడ్డకు ఉంటుందన్నారు. తల్లులకు, గర్భిణులకు సూచన, సలహాలు అందజేశారు. ఏఎన్‌ఎం స్వరాజ్య లక్ష్మి, సీహెచ్‌ఓ దేవి, ప్రధానోపాధ్యాయురాలు రాధ, ఎస్.పద్మ, ఎన్.రవణమ్మ పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: పుట్టిన వెంటనే బిడ్డలకు తల్లిపాలు పట్టిస్తే బిడ్డల్లో వ్యాధి నిరోధక శక్తి పెంపొందించుకోవచ్చని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి పేర్కొన్నారు. మండల పరిధిలోని రామచంద్రకోట అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం జరిగిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. గర్భిణులు, బాలింతలు, రక్తహీనత నివారించుకునేందుకు ఆకుకూరలు విరివిగా వినియోగించుకోవాలని సూచించారు. గర్భిణులు అందుబాటులో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి కేంద్రాలు అందించే పౌష్టికాహారం తీసుకోవటంతో పాటు అంగన్‌వాడీ కార్యకర్తల సలహాలు, సూచనలు తీసుకోవాలని కోరారు. సూపర్‌వైజర్ అంజమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త ఉమాదేవి, రాజేశ్వరి, సరోజ పాల్గొన్నారు. యడవల్లిలో జరిగిన తల్లిపాల వారోత్సవాల్లో అంగన్‌వాడీ కార్యకర్త సుబ్బమ్మ, ఏఎన్‌ఎం సరస్వతి, ఆశావర్కర్లు కోటేశ్వరి, పద్మ పాల్గొన్నారు.



పదమటి బజార్‌లో ర్యాలీ చేస్తున్న బాలింతలు, గర్భిణులు

యర్రగొండపాలెం: తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టమైనవని, అందుకు ప్రత్యమ్నాయం లేదని అంగన్‌వాడీ కార్యకర్త షేక్ శంషాద్ అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శనివారం స్థానిక పదమటి బజార్, మండలంలోని కొత్తగోళ్లవిడిపి, గుర్రపుశాల గ్రామాల్లో ఆయా ప్రాంతాల అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి గర్భిణులు, బాలింతలకు అవగాహన కలిగించారు. ఆయా కార్యక్రమాల్లో సీడీపీవో పద్మావతి, సూపర్‌వైజర్లు కేవీ సుబ్బమ్మ, కార్యకర్తలు పూజల మూర్తెమ్మ, సుబ్బరత్నం, మార్తమ్మ, చెన్నమ్మ, భారతి, ఎంఎల్‌హెచ్‌పీ రత్నకుమారి, ఏఎన్‌ఎం నాగేశ్వరి, ఆశ వర్కర్ సారమ్మ పాల్గొన్నారు.

కుడి కాలువకు సాగు నీరందించాలి



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

దర్శి: కుడి కాలువకు సాగు నీరందించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉన్నం శ్రీనివాసులు కోరారు. స్థానిక ఎన్‌ఎస్‌పీ కార్యాలయంలో ఈ మేరకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఎడమ కాలువకు సాగుకు, తాగు నీటికి నీరు విడుదల చేశారని చెప్పారు. కుడి కాలువకు కూడా సాగునీరు విడుదల చేసి జిల్లాను కాపాడాలని కోరారు. ప్రకాశం జిల్లాలో వర్షాభావ పరిస్థితులు వెంటాడుతున్నాయని, పశుపక్షాదులకు నీరు లేక సాగు చేసిన పంటలు కూడా ఎండిపోతున్నాయని చెప్పారు. త్వరితగతిన కాలవలకు నీరు విడుదల చేసి చెరువులను కూడా నింపాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు తిండి నారాయణరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాడపాకుల శ్రీను, పట్టణ అధ్యక్షుడు అచ్యుత గురవార్జునరావు, రూరల్ మండల అధ్యక్షుడు కాకర్లసాయి, తెలుగు రైతు నాయకులు తానికొండ ఓబయ్య పాల్గొన్నారు.

కందిలో వైరస్ తెగులుపై అప్రమత్తంగా ఉండాలి



పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

దర్శి: కంది పంటలో వైరస్ తెగులుపై అప్రమత్తంగా ఉండాలని దర్శి వ్యవసాయ సహాయ సంచాలకులు కె.బాలాజీనాయక్ సూచించారు. మండలంలోని వెంకటాచలంపల్లి, చందలూరు గ్రామాల్లో రైతులు వేసిన సజ్జ, కంది పంటలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా బాలాజీనాయక్ మాట్లాడుతూ 38 గ్రామాల పరిధిలో సజ్జ, కంది పంటలు సాగు చేయనున్నట్లు పేర్కొన్నారు. దాదాపు 40 శాతం విత్తడం జరిగిందని చెప్పారు. నాటిన 40 నుంచి 50 రోజుల వ్యవధిలో కంది పంటపై సల్ఫర్ పిచికారీ చేసి వైరస్ ఒక మొక్క నుంచి మరొక మొక్కకు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కందిలో ఎండు తెగులు సోకకుండా విత్తన శుద్ధి చేసి నాటుకోవాలన్నారు. కంది పంటను ఆశించే గూడ పురుగు ఉధృతిని తగ్గించాలంటే మొదటి దశలో వేపనూనె కషాయం పిచికారీ చేయాలన్నారు. సజ్జ పంటలు ఎటువంటి తెగుళ్లు రాకుండా తగిన చర్యాలు గురించి వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వి.బాలాజీ నాయక్ ఈ క్రాప్ గురించి, కౌలు రైతులు ఈ–క్రాప్‌లో నమోదు చేసుకునే విధానంపై అవగాహన కల్పించారు.

కేవీకేని సందర్శించిన

కృష్ణ జోన్ సహసంచాలకులు



రైతులకు టార్పాలిన్ పట్టలు అందజేస్తున్న దుర్గాప్రసాద్

దర్శి: ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సహ పరిశోధనా సంచాలకులు డాక్టర్ ఎన్‌వీవీఎస్ దుర్గాప్రసాద్ స్థానిక కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించారు. కేవీకేలో చేపడుతున్న ప్రదర్శన క్షేత్రాలను వాటి ప్రాముఖ్యతను కేవీకే సమన్వయకర్త డాక్టర్ జి.రమేష్ వివరించారు. అనంతరం ఎస్సీ రైతులకు ఖరీఫ్ పంటల సాగు పంటలపై శిక్షణ ఇచ్చారు. ఖరీఫ్ సాగులో చేపట్టాల్సిన సాగు యాజమాన్య పద్ధతులు, సమగ్ర సస్యరక్షణ పద్ధతులు వివరించారు. అనంతరం ఎస్సీ రైతులకు టార్పాలిన్ పరదాలు సబ్‌ప్లాన్‌లో భాగంగా దుర్గాప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రైతులకు అన్నీ విధాలా సేవలందించేందకు శాస్త్రవేత్తలు కృషి చేయాలని సూచించారు. టార్పాలిన్ పట్టలతో పండించి ధాన్యం తడవకుండా పైన కప్పుకోవడానికి బాగా ఉపయోగపడుతాయన్నారు. నూర్పిడి చేసిన ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి ఈ పరదాలు ఉపయోగపడతాయని చెప్పారు. కేవీకే శాస్త్రవేత్తలు టి.మానస, ఎస్.లీలాకృష్ణ, టి.వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

సమయపాలన పాటించని అధికారులు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోని అధికారులు శనివారం ఉదయం 10 గంటలు దాటినా కార్యాలయానికి హాజరు కాలేదు. సబ్ రిజిస్ట్రార్ రాధాకృష్ణతో పాటు కంప్యూటర్ సిబ్బంది ఎవరూ కార్యాలయానికి సమయానికి రాలేదు. ఒక వైపు పట్టణంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం డీలా పడింది. దీంతో భూమి కొనుగోలు విక్రయాలు సక్రమంగా లేకపోవడంతో రిజిస్టర్‌లు కావడం లేదని అనుకున్నారో ఏమోగానీ కార్యాలయానికి ఎప్పుడు వెళ్తే ఏమిలే అని సరిపుచ్చుకుని అధికారులు, సిబ్బంది అలసత్వంతో కార్యాలయానికి వస్తున్నట్లు ఉంది. వ్యాపారం లేక వెలవెలబోయిన రీతిలో కార్యాలయం బోసిపోతోంది.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

- అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బాలాజీ



చెంచులకు మందులు అందజేస్తున్న జడ్జి బాలాజీ

యర్రగొండపాలెం: పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని సీజనల్ వ్యాధులు దరి చేరకుండా చర్యలు తీసుకోవాలని మార్కాపురం అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.బాలాజీ అన్నారు. శనివారం స్థానిక తిరుమలగిరి కాలనీలో న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రజలు లోక్‌అదాలత్, న్యాయ సేవా అధికార సంస్థను సద్వినియోగం చేసుకోవాలని, లోక్‌అదాలత్ ద్వారా కేసులు సత్వరమే పరిష్కరింపబడుతాయని, రాజీ మార్గంలో కేసులు పరిష్కరించకుంటే ఇరువర్గాల వారికి మేలు జరుగుతుందని, సేవా సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా న్యాయ సాయం అందజేస్తామని చెప్పారు. తిరుమలగిరి కాలనీలో నివాసం ఉంటున్న చెంచులకు పాలుట్ల, వెంకటాద్రిపాలెం పీహెచ్‌సీ సిబ్బంది 200 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మార్కాపురం డీఎంహెచ్‌వో డాక్టర్ పద్మావతి, ఇన్‌చార్జి తహసీల్దార్ విజయభాస్కర్, ఎంపీడీవో వైవీ నాగేశ్వరప్రసాద్, ఎలక్షన్ డీటీ రామకృష్ణ, సీడీపీవో పద్మావతి, వైద్యాధికారులు పి.చంద్రశేఖర్, వెంకటేశ్వర నాయక్, వి.కోట నాయక్, సయ్యద్ నాయబ్ రసూల్, మనోజ్‌ఖన్నా పాల్గొన్నారు.

దళితుల్లో ఐక్యతను జీర్ణించుకోలేకే వర్గీకరణ చిచ్చు

- మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దారా



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మాలమహానాడు నాయకులు

తాళ్లూరు (ముండ్లమూరు): దళితుల్లో ఐక్యతను జీర్ణించుకోలేకనే ఎస్సీ వర్గీకరణ చిచ్చు పెట్టారని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు నిరసనగా శనివారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద మాల మహానాడు కార్యకర్తలతో కలిసి మోకాళ్లపై అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును అంగీకరించబోమని స్పష్టం చేశారు. ఆర్టికల్ 341 ప్రకారం పార్లమెంటులో చట్టం చేయకుండా జాబితాలో మార్పులు చేసే అధికారం ఎవరికీ లేదన్నారు. అగ్రకుల మనువాద పార్టీలు ఎస్సీలను విభజించు, పాలించు అనే రీతిలో కుట్రకు పాల్పడుతున్నాయని తెలిపారు. ఇప్పుడు వర్గీకరణ అంటారు.. భవిష్యత్‌లో రిజర్వేషన్లు ఎత్తివేసే ప్రయత్నాలు చేస్తారన్నారు. తీర్పునకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టులో రిట్ పిటిషన్ వేస్తామన్నారు. దళితులందరూ వర్గీకరణను వ్యతిరేకించాలని దారా అంజయ్య కోరారు. అంబేడ్కర్ యూత్‌ఫోర్స్ యువజన సంఘం కార్యదర్శి బి.సురేష్, వాణిజ్య విభాగం కార్యదర్శి పి.కోటేశ్, అంబేద్కర్ వాది బంటుపల్లి ప్రకాష్, పులుగు చినమోషే, ఆదాం పాల్గొన్నారు.